మాతృ హృదయం దుర్మార్గుడయినా కొడుకును ప్రేమిస్తూనే వుంటుంది. మానవత్వం ఆ స్వార్థాన్ని ప్రశ్నిస్తూనే వుంటుంది. ఈ రెంటికి నడుమ నలిగిపోయిన ఓ తల్లి కథ:

ఎండ మిటమిటలాడిపోతోంది. హాయిగా నీడపట్టున కూర్చున్నవాళ్ళే ఉస్సురుస్సురంటూ అవపోపాలు పడుతున్న వేళ, కాళ్ళకి చెప్పులు లేకుండా, తలమీద తడిపైట చెరగు కప్పుకుని, చేతిలో రోకలితో కారం దంపుళ్ళకి బయల్దేరింది సుబ్బలక్ష్మి.

"కాళ్ళకి చెప్పులు లేకుండా ఈ ఎండలో ఏం వెళ్తారు? కాస్త చల్లబడిన తర్వాత వెళ్ళకూడదూ?" అంది కోడలు సుగుణ గుమ్మంలో కొచ్చి నిలబడుతూ.

"ఆ మాయదారి కుక్క ఓ చెప్పు పట్టుకుపోయిందా. మళ్ళీ కొనాలంటే ఏం కొనగలం? అయినా నాలుగడుగులు వేస్తే మున్నబుగారిల్లు. ఇల్లు చేరితే చెట్టు నీడ నేగా వుండేది. వేడిగాల్పు కొడుతోంది. నువ్వెళ్ళు లోపలికి అసలే వట్టిమనిషివి కావు. వేడి చేస్తే నరాలు బిగపడతాయి. వెంకటరత్నం వస్తే ఉట్టి మీద పెరుగ్గిన్నె పెట్టాను మర్చిపోకుండా వెయ్యి" అంటి హడావుడిగా మెట్లు దిగుతూ సుబ్బలక్ష్మి. ఆవిడొక్కతే కొడుకుని వెంకటరత్నం అని పిలుస్తుందిగాని ఊళ్ళో వాళ్ళంతా "వెంకటం" అంటారు.

ఏదో మర్చిపోయినదానిలా రెండుక్షణా లలా నిలబడి, మళ్ళా వెనక్కొచ్చి "ఆ మాయదారి తాగుడు లేకపోతే ఆ వెధవ ప్రాణాలల్లాడిపోతాయి. మరీ అడిగితే కావిడిపెట్టెలో చిల్లరుంది ఇయ్యి." అంది గొణుగుతున్నట్లుగా.


సుగుణ మొహంలో రంగులుమారాయి "మీదంతా చాదస్తం హాయిగాతిని కూర్చోవాల్సిన ఈ వయస్సులో నానా బాధలూ పడుతూకూడా, ఆయనగారి కులాసాలకి డబ్బులివ్వాలా? మీరు ఖచ్చితంగా కాదంటే ఆ మనిషికెప్పుడో బుద్ధొచ్చేది."

"కాదంటే ఊరుకుంటాడా? నాలుగు తన్నయినా పట్టుకుపోతాడు. నీకు తెలియని దేముంది?"

"మొక్కై వంచకపోతే-" ఆ తర్వాత మాటలు మింగేసి మొహం తిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది సుగుణ.

"అందరూ గారాబంగానే పెంచుకుంటారు. కాని వీడిలా తయారవడం నా ఖర్మ. నాదెప్పుడూ దురదృష్ట జాతకమే" సుబ్బలక్ష్మి కళ్ళల్లో నీళ్ళూరి చెంపలమీదకి పాకాయి.

పదేళ్ళకే పెళ్ళయింది సుబ్బలక్ష్మికి. భర్తకి బంగారం కొట్టు. రాబడి బాగానే వుండేది. కాని ఏం లాభం? లేని వ్యసనం లేదు. ఆ సంగతి దాచిపెట్టి పెళ్ళి చేశారు. పెళ్ళయిన రెండేళ్ళకి పెద్దమనిషైంది సుబ్బలక్ష్మి. కార్యానికి ఎన్ని కబుర్లు వెళ్ళినా అల్లుడు రాకపోయేసరికి విసుగు పుట్టి చేసేదేమీలేక పిల్లని అత్తవారింట విడిచి పెట్టి పోయారు కన్నవారు. వాళ్ళు ఏడుస్తూ అప్పగింతలు పెడుతుంటే తనూ కుళ్ళి కుళ్ళి ఏడిచిందిగాని తన స్థితి తెల్పికాదు. అసలు దాంపత్య సుఖం గురించి యెలాంటి కలలూ, వాంఛలూ లేవు సుబ్బలక్ష్మిలో. పగలంతా చాకిరీ, రాత్రి వళ్ళెరగని నిద్ర. అలా ఓ ఏడాది గడిచింది. ఒకరోజు సుబ్బలక్ష్మి గాఢనిద్రలో వుండగా వంటిమీద పెద్ద బండ పడ్డట్లయి మెలుకువ వచ్చేసింది చెమటకంపు, సారావాసన్ని పంపిణీ చేస్తున్న తీవ్రమైన శ్వాస. ఎలుగుబంటిలా వళ్ళంతా తడుముతున్న మొగుడ్ని చూడగానే సుబ్బలక్ష్మి భయంతో వణికిపోయింది. లేవబోయింది. తొయ్యబొయ్యింది. కాని భర్తగా తన అధికారాన్ని పూర్తిగా వినియోగించుకుని మొద్దులా నిద్రపోయాడా మానవుడు. తర్వాత తెల్సింది ఉంచుకున్నదానికీ అతనికీ చిన్న ప్రణయ కలహంవచ్చిఆ రాత్రి పూట ఇంటికొచ్చాడని.



చిలక ముగ్గు చిత్రం : పసుపులేటి లక్ష్మీతులశమ్మ, అమరావతి



# ఓ తల్లి కథ

## జాగర్లమూడి స్వర్ణలత

ఆ కొద్ది క్షణాలకే ఆ ఒకే ఒక్క రోజు సుబ్బలక్ష్మి జీవితంలో పురుషస్పర్శ తెలుసుకున్నరోజు. తన శరీరాన్ని తనే అసహ్యించుకున్న రోజు. భర్తపట్ల ఏ భావమూలేని ఆ మనసులో అసహ్యాన్ని జుగుప్సనీ మాత్రమే మిగిల్చిపోయిన రోజు. కొడుకు పుట్టకముందే నానా రోగాలపాలై అతినికృష్టంగా పోయాడతను. ఆ స్తంతా అప్పులపాలైంది. కన్న వాళ్ళు అంతంతమాత్రం. సుబ్బలక్ష్మికి రెక్కలే ఆధారమయ్యాయి.

నానాబాధలూపడి. ఇరుగూ పొరుగూ సాయంతో పురుడు పోసుకుంది. మాతృత్వం ఆడదానికి శాపమో. వరమో. పొత్తిళ్ళలో బిడ్డను చూసుకోగానే సర్వమూ మర్చిపోయి, వాడికోసం బ్రతికింది. వడ్లు దంచి, బియ్యం బాగుచేసీ. వడియాలు అప్పడాలు పెట్టి వంటలు చేసి. నీళ్ళు మోసి. తన యవ్వనాన్ని కోరికల్నీ కాల్చుకుని కొడుక్కి ఏ లోటూ లేకుండా పెంచుకొచ్చింది. వాడికి ముల్లు గుచ్చుకుంటే తన గుండెల్లో గుచ్చుకున్నట్లు విలవిలలాడేది. వాడి కళ్ళల్లో నీళ్ళు చిమ్మితే తన ప్రాణాన్ని పీకుతున్నట్లు తపించేది. అడిగినప్పుడల్లా డబ్బులు. తల్లి అమాయకత్వం. చెడు స్నేహాలు వెంకటాన్ని ముళ్ళబాటలోకి లాగాయి. అచ్చు తండ్రి పోలికే అన్పించుకున్నాడు. వాడికంటూ ఓ సంపాదన. సంసారం ఏర్పడితే బాగుపడతాడన్న ఆశతో మిఠాయికొట్టు శెట్టిని బ్రతిమాలి కొడుకుని పనిలో కుదిర్చింది. కొడుకు సంగతంతా దాచి సుగుణ మెడలో మూడుముళ్ళూ వేయించింది. కొత్త మోజులో ఏ నెల రోజులు యింటిపట్టు నున్నాడో వెంకటం. తర్వాత మామూలే. మునుపు తనొక్కతే ఏడిస్తే పొయ్యేది. కాని యిప్పుడు? నా గొంతు కోసావన్నట్లు చూసే వాడిచూపులు! మూగగా ఏడ్చే మరో ఆడతోడు. అది భరించలేక పోతోంది సుబ్బలక్ష్మి.

మున్సబుగారింటికి చేరుకునేసరికి చెమటతో ముద్దయింది సుబ్బలక్ష్మి. ఉస్సురంటూ పెరట్లోకి వచ్చి కూలబడింది. సుబ్బలక్ష్మిని చూస్తే అందరికీ జాలి. "నువ్వేం పోపెయ్యగలవులే పంతులమ్మా జల్లెడపట్టు." "అన్నారప్పుడే దంపడం మొదలెట్టినవాళ్ళు. వేడి గాలి- దానికితోడు కారంకోరు. మంటల్లో పెట్టినట్లుగా వుంది వళ్ళు. కొన్ని గంటలసేపు ఆ నరకంలో మగ్గినతర్వాత కారం, ఆవపిండి. మెత్తటుప్పు. ఆవకాయ సరంజామా తయారైంది.

"సుబ్బలక్ష్మి చెయ్యిమంచిది. కొత్త

అంబడిపూడి

సెక్స్ విజ్ఞాన ప్రచురణలు

1. గర్భమూ-గర్భ నిరోధం (40 చిత్రాలతో) 2. గుప్తజ్ఞానం (6000 మంది దంపతుల సమస్యలకు పరిష్కారం) 3. స్త్రీ కోరేదేమిటి? 4. అరచేతిలో వైకుంఠం (అందరిని ఒప్పించడం, మెప్పించడం ఎలా?) 5. కోర్కెలు తీరడానికి 100 మంత్రాలు. 6. భయమెందుకు? (యవ్వన దురభ్యాస బాధితులు) 7. స్వామి అయ్యప్ప. 8. దయ్యాలు చేసే గమ్మత్తులు. 9. వరప శృంగారాలు (ముద్దు-ముచ్చటలు) రు. 25/- మనియార్డరు పంపిన వారికి పంపబడును. వి. పి. పద్ధతిలేదు. ముందుగా డబ్బు పంపాలి.

జలజ ప్రచురణలు, విజయవాడ-3.



RADHIKA

అత్యున్నతమైన మృదువైన కాటన్

ట్యాంగో®

అండర్‌వేర్లు

ట్యాంగో®

బనియన్లు



ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన మొదటి మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :

Samaj Kalyan (R.L. 78)

(P. o) Katri Sarai (Gaya)


పచ్చడి కలిపిపో సుబ్బులూ" అంది మునసబు భార్య.

"రామా.... రామా...." అని దణ్ణం పెట్టుకుని నూనె, పిండి, ముక్కలూ కలిపి జాడీలో వేసింది సుబ్బలక్ష్మి.

"ఎలా వుంది కొత్తకాపరం?" అంది మునసబు భార్య దగ్గరగా పీటవేసుకుని కూర్చుని.

"ఏదో సాగిపోతోంది. కడుపున పుట్టిన పిల్లలున్నయినా చూసుకుని బాగుపడతాడేమోనన్న ఆశ."

"ఏమిటో నీ బ్రతుకు! ఓనాడన్నా కాస్త సుఖంగా కూర్చుని ఎరగవు. కోడలు పిల్లొచ్చింది కదా కాస్త తెరిపిగా వుండరాదూ?" అంది ఆవిడ పమిట చెరుగుతో విసురుకుంటూ.

"ఏం తెరపమ్మా? ఈ మాయదారి పెళ్ళి చెయ్యకపోయినా నా ప్రాణానికి హాయిగా వుండేది. నేను జీవితాంతం పడ్డాను. మరో ఆడదానికి తెల్ళి ఉరితాడు వేశాను. ఆ పిల్ల మొహం చూస్తే గుండె తరుక్కుపోతుంది. ఏం చేస్తే నా పావపరిహారమవుతుందో" సుబ్బలక్ష్మి కళ్ళల్లో నీళ్ళూరాయి.

"ఈ ముక్క ఆ పిల్లెదుట అనమాకు. మరీ తేలికైపోతావు. ఎవరి కర్మ ఎవరికి తప్పుతుంది చెప్పు?"

"ఏం ఖర్మో ఏం జీవితాలో" గొణుక్కుంది సుబ్బలక్ష్మి.

రెండు శేర్ల బియ్యం, డబ్బులూ ఇచ్చిందావిడ. దార్లో నాలుగు వత్తాయిలు కొనుక్కుని ఇంటివైపు నడిచింది సుబ్బలక్ష్మి. రోజులా సుగుణ ఎదురు రాలేదు. నడిమింట్లో పడి గొడ్డులా మూలుగుతోంది. నెత్తుటి మడుగులో.

సుబ్బలక్ష్మి చేతిలో పళ్ళు నేలమీదకి జారిపోయాయి. నోటమాట రాకబొమ్మలా నిలబడి పోయింది. నిలువు గుడేసుకుని.

"ఆ మనిషి డబ్బు లడిగితే లేవన్నావని



'ఎన్నడో ఇల్లెక్కి, ఎలుగెత్తి కూసెను కొమరయ్య బంగారు కోడిపుంజు'

— దాశరథి

చిత్రం : ఎస్.టి.వి. శేషు, హైదరాబాద్.

తన్ని ఇక్కడ.... ఇక్కడ" పొట్టవైపు చూపించి, గొల్లున ఏడిచింది సుగుణ.

జరిగిందేమిటో అర్థమైంది సుబ్బలక్ష్మికి. మొట్ట మొదటి సారిగా కొడుకు మీద అసహ్యం కలిగింది.

అవి జరిగిన రెండు రోజుల తర్వాత యింటి కొచ్చాడు వెంకటం. సుబ్బలక్ష్మి బియ్యం ఏరుతోంది.

"అదేదీ?" అన్నాడు తల్లికి దగ్గరగా వచ్చి నిలబడుతూ.

సుబ్బలక్ష్మి సమాధానమివ్వలేదు.

"అడిగితే చెప్పవేం?" రెట్టించాడు.

"ఏమని చెప్పనురా? చేసావుగా నిర్వాకం. దాని కడుపులో చిచ్చుపెట్టావు. ఏముందని వచ్చావు? వెళ్ళు నీ పీడ నేను భరించలేను."

"తిన్నగాచెప్పి ఏడవకూడదూ? నేనూ



# దాంపత్యం!

నేను కదలను
కరగను
చూడను
చలించను
స్పందించను
కాని నువ్వు మాత్రం
నన్నే నమ్ముకుని
నా చుట్టూ సదా ప్రదక్షిణంచేయాలి.

—కె. శివారెడ్డి

---

రికే తన్నానా? అదెంత పొగరుమోతు వేషాలు కట్టిందో తెల్సా? చెప్పు కింద తేలులా పడుండాల్సిన ముండ ఎదురు తిరిగితే తన్ని వదిలిపెట్టాను. ఈసారి మక్కెలిరగదంతాను. మొగుడితో ఎలా వుండాలో దాని నోటో గడ్డి పెటి బుద్ధిచెప్పు. ఊరికే బోసుకోలుపుస్తకాలు కాకుండా పతివ్రతల కథలు చదివి బాగుపడమను. అయినా ఇదేదో సంపాదిస్తున్నట్లు.''

"పతివ్రతలు. వల్లకాదు ఆ కాలం పోయిందిరా అది సంపాదించక పోతే నేను మాత్రం దానికోసమే సంపాదిస్తున్నాను"

"సంపాదన-బోడి సంపాదన. గట్టిగా ఖర్చుపెడితే ఒక రోజు రాదు. అయినా దానికి- నీ సపోర్ చూసుకుని కండకావరంగా వుంది. దానితిక్క-.నీ సపోర్ట్ దించీగల్ను జాగ్రత్త...." హుంకరించాడు వెంకటం.

"ఏరుకు తినేవాడికి గీక్కు-తినేవాడన్నటు నన్ను పీక్కు-తింటావేంరా? నీ బ్రతుకు నువ్వు బ్రతుకు మా బ్రతుకు మాది"

"అదంతా ఏమోగాని ఆకలి దంచేస్తోంది. అన్నం పెట్టు. కారం దంపుళ్ళ జోరు మీదున్నావుగా నాలుగిటు పడెయ్యి."

"నోరు మూసుకెళ్ళు" విసురుగా లోపలకి పోయింది సుబ్బలక్ష్మి.

గుమ్మం ముందు నిలబడి, నాలుగు బూతులు తిట్టి మరీ పొయ్యాడు వెంకటం. ఆ రోజంతా సుబ్బలక్ష్మి కళ్ళు తడి ఆరలేదు. ఆ రోజుకలా అన్నా. తర్వాత వెంకటం రావడం అన్నం తిని పోతూ డబ్బుకోసం పీడించడం మామూలే. ఆ రోజు తర్వాత వెంకటం మొహంలోకి చూడలేదు సుగుణ ఎన్ని కలలూ కోరి కల్తో వచ్చిందో అంత విరిగిన మనసుతో పుట్టింటి కెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు వెంకటం వున్నా కన్నెత్తి చూడలేదు.

"వెళ్తాను" అంది పొడి పొడిగా సుబ్బలక్ష్మితో.

"వెళ్ళొస్తాననాలి." అందామనుకుంది సుబ్బలక్ష్మి. కాని అనలేకపోయింది.





మంచం కింద మహారాజు

వెళ్ళినతర్వాత కబురూ, కాకరకాయానేదు. అప్పుడప్పుడూ రకరకాల వార్తలొచ్చేవి. వాళ్ళనోటా వీళ్ళనోటా. "నీ కోడలు మిషను నేర్చుకుంటోందని". "బట్టలుకుట్టి సంపాదిస్తోందని" "కుటు టీచరుగా నెల జీతం తెచ్చుకుంటోం"దని

ఓరోజు వెంకటం దూకుడుగా వచ్చాడు. "శెట్టిగారి పనిమీద పాలకొల్లు వెళ్ళాను. అక్కడ నీ కోడలు కనబడింది. బాగా నాజూకుతేలింది ముండ. పలకరించబోతే మొహం తిప్పుకుని పోయింది. దానికంత నీలుగుడా? తొందరగా కాపరానికి పంపమని కబురుపెట్టు, తిక్క దిగుతుంది."

సుబ్బలక్ష్మికి సుగుణ ధోరణి అర్ధమైంది

"ఇంతే క్షోభ తనూ అనుభవించింది. ఆ రోజుల్లో యింత మాత్రం మార్పుంటే తనూ తెగించేదే. సుగుణకి తను అడ్డురాదు తనలా మరొకర్ని ఏడుస్తూ చావమనడం న్యాయంకాదు అంతే" అనుకుంది సుబ్బలక్ష్మి. అలా అనుకున్న తర్వాత వెంకటం ఎంత ఊదర పెట్టినా పట్టించుకోలేదు. రోజులు జరుగుతూనే వున్నాయి. సుబ్బలక్ష్మి [illegible]క్కలు ముక్కలు చేసుకుంటూనే వుంది. ఆ శ్రమని పిండుకుంటూనే వున్నాడు వెంకటం

ఆ రోజు సుబ్బలక్ష్మి కత్తిపీట ముందు కూర్చుని కూరలు తరుగుతోంది. తూలుతూ వచ్చాడు వెంకటం- "నాకు డబ్బు కావాలి" అంటూ.

ఇప్పుడు సుబ్బలక్ష్మికి కొడుకుని చూస్తే వళ్ళుమండుతోంది. మనసులో మమతని బైటికి రానివ్వకుండా కరుకు మాటలు అడ్డం వేసోంది.

"ఎవడబ్బ సొమ్మందని అలా అడుగుతున్నావు? కూలి చేసుకుని డబ్బులు సంపాదించుకుని తాగు. నేను మాత్రం ఇవ్వలేను."

"నాకు.... కూ.... లెందుకు? గుండ్రాయి శెట్టి కులాసాగా వున్నంత కాలం సారా డబ్బు.... లుంటాయి.... గని. శ్రీవల్లిని సినిమాకి తీసుకెళ్ళాలి. పాలకొల్లు.... [illegible] బ్బులు కావాలి."

"దానిదగ్గర లేవూ....?"

"దాని....ద..గ్గరు..ంటేనిన్న... డగడమెందుకు? అయినా మొ . గా... డ్ని.... దాని ఖర్చంతా నేను భరిం.... చాలి అది నన్ను."

"నోరుమ్మయ్ వెధవ వాగుడు వాగకు. నా దగ్గర లేవంటే లేవు"

"లేవూ? ఆ రాగులకుండ పొట....లో. కెందు.... కే డ....బ్బు.... లు వేస్తావు? నా చేతిలో వెయ్యి నీ....కా.. ళ్ళ....కి.... మొ... క్కుతాను... త ల్లీ ..."

"అవిలేకపోతే రెండురోజులు డొక్కలు మాడ్చుకోవాలి."

"పోతే పోనియ్యవే శెట్టి. నడిగి. తేవ.. దు.. లు కాదు. వంద.. లిస్తాడు. ఆరంకు.. ముండ ఎ.. వరూ నా పెళ్లాం. అది . వేలిస్తు.. ంది. వళ్ళ . మ్మకు.... నైనా.. సరే. ఇప్పుడు.. మా . త్రం.... మ . ర్యాదగా ఇచ్చేయ్" రంకెవేశాడు వెంకటం.

అయినా విన్న.. డిగేదేం.. దంట.... వు.. తి వెధ.. వని.... నే.... నే తీ.... సుకు.. ంటాను." రాగుల కుండ మీద మట్టి మూ[illegible]డు ఎత్తిపడేశాడు వెంకటం.

"ఒరేయ్ ... ఒరేయ్" అడ్డుకుంటున్న సుబ్బలక్ష్మిని ఒక్కతోపు తోసాడు.

"అమ్మా...." వెనక్కి విరుచుకుపడిన సుబ్బలక్ష్మి కేక నాలుగిళ్ళవతలకి వినిపించింది ఇరుగూ, పొరుగూ పరిగెత్తుకొచ్చేసరికి వెంకటం పెరటిత్రోవన పారిపోయాడు. సుబ్బలక్ష్మి వెన్నులో పక్కగా దిగబడింది. పదునుగావున్న కత్తిపీట. సుబ్బలక్ష్మిని హాస్పిటల్‌కి వేసుకుపోయారు. డాకరు పెదవి విరిచాడు. ఎలా వార్త అందిందో పోలీసులొచ్చారు. సుగుణ వచ్చింది. ఊళ్లోవాళ్ళంతా వచ్చారు.

"ఎవరుకారణం" అంటున్నారు పోలీసు వాళ్ళు. ఏం చెప్పాలి? వెంకటమే అని చెప్పేవాడు కావాలని చెయ్యలేదు? ఈ


ఉచితము! ఉచితము!!

తెల్ల మచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలకు :

Krishna Chandra Vaidava (AJ)
P. o Katri Sarai (GAYA) INDIA

డా.పి వి.కె.రావ్, B.A. సెక్స్ స్పెషలిస్ట



వైద్య విద్వాన్ — వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, స్వప్న స్ఖలనము, శుక్లనష్టము [illegible]రోగములకు, మా వసిక [illegible]యులకు శాస్త్రీయ చికిత్స [illegible]పోస్టుద్వారాకూడాచికిత్సగలదు.

[illegible]వూస్ క్లినిక్,

టి.బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700 & 1010

రోజు విలా వదిలేసినా రేపు సుగుణ వంటనచేరి దాని బ్రతుకూయిలాగే అంతం చేస్తాడు. సుగుణ గొంతుచుట్టూ ఉరిబిగించిందితను. దాన్ని తనే విప్పాలి" సుబ్బలక్ష్మి మనసులో రకరకాల ఆలోచన్లు.

"చెప్పాలి? యెవరు దీనికి కారణం?" ఇన్‌స్పెక్టర్ గొంతులో చిరాకు.

"నా కొ.... డు.... కు.... వెంక.... ట... రత్నం..... నన్ను... పొ..... డి.... చి...... పా.... రి.... పొయ్యాడు" స్టేట్‌మెంట్ రికార్డుచేసుకుని వెళ్ళిపోయారు పోలీసులు.

"తన కోసమా ఈవిడిలా చెప్పింది! తన బ్రతుకు సుఖంగా వుండాలని కొడుకుని నిప్పుల్లోకి తోస్తోంది. ఇంతటి త్యాగం ఎవరికి సాధ్యం? జీవితంలో ఎలాంటి సుఖమూ అనుభవించకపోయినా తోటి ఆడదాని సౌభాగ్యంకోరుకుంటోంది. ప్రతీ ఆడదీ ఇంత త్యాగం చెయ్యకపోయినా కోడలుగా తమింట అడుగు పెట్టిన మరో ఆడదానికి కొంత విలువా, రవ్వంత సానుభూతి చూపిస్తే ఈ సమాజం ఎంత బాగుపడుతుంది? ఎన్ని సంసారాలు సుఖశాంతుల్తోవిలసిల్లుతయి?" సుగుణ మనసంతా సుబ్బలక్ష్మి పట్ల గౌరవంతో నిండిపోగా, కాళ్ళదగ్గర కూలబడి పాదాలమీద చేతులువేసి భోరున ఏడ్చింది.

"నా తీర్పు బావుందా సుగుణా? నువ్వు మళ్ళీ పెళ్ళిచేసుకుని హాయిగా బ్రతకాలి." ఆ మాటన్నతర్వాత ఓ పక్కగా పడుకుని ఏదో ఆలోచన్లో పడింది సుబ్బలక్ష్మి. ఆ ఆలోచన్లకి ఫలితమన్నట్లుగా ఒక్కసారి లేచి కూర్చుంది.

"నేను తల్లినేనా? కాదు నేను తల్లిని కాదు. రాక్షసిని అందర్నీ పొట్టన పెట్టుకునే పిశాచాన్ని. నా బిడ్డ.... అయ్యో.... నా బిడ్డ...." అంటూ పిచ్చిదానిలా ఏడవడం మొదలు పెట్టింది. గుండెలు బాదుకుంది. జుట్టు పీక్కుంది! ఆ మాతృహృదయంలో రేగిన క్షోభ అంతా ఇంతా కాదు. డాక్టరు వచ్చి మత్తు ఇంజక్షను ఇచ్చి వెళ్ళాడు. మెలకువ వచ్చినప్పుడల్లా "నా కొడుకు నా కొడుకు" అంటూనే వుంది సుబ్బలక్ష్మి.

అక్కడున్న ఇరుగూ, పొరుగూ వాళ్ల "పిచ్చి సుబ్బులు- ఆ కసాయివాడి మీద వెర్రి ప్రేమ. సుఖంగా బ్రతకనివ్వలేదు. చావనివ్వడంలేదు" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

ఆ బాధలోనే ఆ కలవరింతల్తోనే ఏ రాత్రప్పుడో శాశ్వత నిద్రలోకి జారిపోయింది సుబ్బలక్ష్మి. ★

నేటి పాఠకులకు మేటి ప్రచురణలు
కొవిలిపాటి విజయలక్ష్మి నవలలు

పొద్దు మలుపు 10.00
పెంపుడు కొడుకు 8.00
అపశ్రుతులు 8.00
అగ్రహారం 8.00
జీవన సంధ్య 6.00
చాకులాంటి పిల్ల 7.50

డీలక్స్ పబ్లికేషన్స్
ఏటూరు రోడ్. విజయవాడ-2

THE INSTITUTE OF ENGLISH STUDIES
ఆంగ్ల భాషాబోధక సంస్థ,
3, మొదటి మెయిన్‌రోడ్డు, లేక్ ఏరియా,
నుంగంబాకం, మదరాసు-600 034
(వళ్లువరుకోటము ప్రక్కన)

TRUE KNOWLEDGE
CANNOT BE
MEASURED
IN DEGREES

16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు
అధికపక్షము
ఒక సంవత్సరములో
ఆంగ్లములో
సంభాషించుటకును.
పరిచయముచేసికొనుటకును
తపాలా ద్వారా
విశ్రాంతి సమయములో



ప్రారంభమునుండి కాని - లక్ష్యలక్షణ పరిశోధన పద్ధతిలో కాని
ఇంగ్లీషు
నేర్చుకోవచ్చును.

గంగిరెడ్డు: నేనభ్యసించిన విద్యకు కట్నకానుకలు లేవు!
పెళ్ళిళ్ళ పేరయ్య: ఓయబ్బో! నీవంతేమి చదివితివి?
బూం, బూం, బూం, గంగిరెడ్డా
గంగిరెడ్డు: నేను పఠించిన పాఠములకు పట్టములు లేవు!
ఏ వ్యవసాయ విశ్వవిద్యాలయములోను "అతిమేధావి" యను పట్టములేదు.
పేరయ్య: బూం, బూం ఎద్దా మానవులవలె కట్నకానుకలుకోరు కనిష్ట బుద్ధి నీకేల? మా అమ్మాయి విదేశములో పుట్టినది. ఆంగ్లము నభ్యసించినది. మాట్లాడక మనువాడు
గంగిరెడ్డు: సరి! ఢుం, ఢుం, బూం, బూం, బూం, బూం.

చేరుటకై దరఖాస్తు చేయుటకు ఆఖరు తేదీలేని, పూర్తి వివరములకును వెంటనే లేఖ వ్రాయండి.

ప్రారంభించు క్రొత్త తరగతులగూర్చి వేరుగా వచ్చికాని
25 పైసల తపాలాబిళ్లతో
లేఖను వ్రాసికాని పూర్తి వివరములను తెలిసికొనండి. వెంటనే చేరండి.

G. SHANMUGASUNDARAM, Principal